క్లుప్తంగా

దేశాలమ్మను దర్శించుకున్న గోపి



దేశాలమ్మను దర్శించుకుంటున్న గోపి

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు పట్టణ దేవత దేశాలమ్మ అమ్మవారి జాతర పురస్కరించుకుని సోమవారం అమ్మవారిని వైఎస్సార్ సీపీ పాలకొల్లు ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టణ ప్రజలను చల్లగా చూడాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు గోపిని అమ్మవారి శేష వస్త్రంతో సత్కరించారు. ఆయన వెంట పార్టీ పట్టణ అధ్యక్షుడు చందక సత్తిబాబు ఉన్నారు.

ఘనంగా పైడి మారెమ్మ తల్లి జాతర



విశేషాలంకరణలో దర్శనమిస్తున్న పైడి మారెమ్మ అమ్మవారు

మొగల్తూరు: రామన్నపాలెం పంచాయతీ జెట్టిపాలెం గ్రామంలో వేంచేసియున్న పైడి మారెమ్మ అమ్మవారి జాతర ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. తొలిరోజు ఆదివారం గండర దీపారాధన వెలిగించి ఉత్సవాలను ప్రారంభించగా రెండో రోజు సోమవారం ఉదయం నుంచి అమ్మవారి దర్శనానికి భక్తులను అనుమతించారు. అమ్మవారిని గ్రామంలో ఊరేగించి నిప్పులగుండం నిర్వహించారు. రామన్నపాలెం గ్రామంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. మరో రెండు రోజులపాటు అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని, 30వ తేదీన భారీ అన్న సమారాధన నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

డ్రెయిన్ల పూడికతీత పనుల పరిశీలన



2వవార్డులో డ్రెయినేజీ పూడిక తీత పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

నరసాపురం: వేసవి ముగిసేలోగా పట్టణంలోని అన్ని ప్రధాన డ్రెయిన్లను శుభ్రం చేయాలని మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. పట్టణంలోని మెయిన్‌రోడ్డులో డ్రెయినేజీలో సిల్ట్ తీసే పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ డ్రెయిన్ నుంచి బయటకు తీసిన వ్యర్థాన్ని వెంటనే అక్కడనుంచి తొలగించాలని చెప్పారు. లేదంటే పారిశుధ్య ఇబ్బందులు ఏర్పడతాయన్నారు. పట్టణంలో మిగిలినచోట్ల కూడా డ్రెయినేజీలు వెంటనే శుభ్రం చేయాలని, లేదంటే అధిక వర్షాలు పడితే మురుగు పారక ఇబ్బందులు పడాల్సి వస్తుందని చెప్పారు.

నేడు ఆల్ ఇండియా ఓపెన్ చెస్ పోటీలు

నరసాపురం: ఏపీ చెస్ అసోసియేషన్, మాస్టర్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో నూలి పాయి అభయ్ స్మారక ఆల్ ఇండియా చెస్ పోటీలు మంగళవారం పట్టణంలోని అల్లూరి సాంస్కృతిక కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు అభయ్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు నూలి శ్రీనివాస్ చెప్పారు. పోటీల్లో 500 మంది క్రీడారులు పాల్గొంటారన్నారు. విజేతలకు రూ 64 వేల ప్రైజ్‌మనీ అందిస్తామని తెలిపారు. గత ఏడేళ్లుగా అభయ్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

పాస్టర్‌కు సత్కారం

పోడూరు: గుమ్ములూరు పేరిష్‌లో 6 సంవత్సరాలు దేవుని పరిచర్య చేసిన పాస్టర్ ఇంజేటి సురేష్ బాబు తూర్పుగోదావరి జిల్లా సినడుకు బదిలీ అయిన సందర్భంగా సోమవారం గుమ్ములూరు లూథరన్ చర్చిలో ఘనంగా సత్కరించారు. గుమ్ములూరు పేరిష్ ఆల్టర్నేట్ డెలిగేట్ విప్పర్తి ప్రభాకర్ ఆధ్వర్యంలో క్రీస్తు లూథరన్ సంఘ సీఆర్, సంఘస్తులు, పెద్దలు, స్త్రీల సమాజం, యూత్, సండే స్కూల్ టీచర్ బాలబాలికలు, సి సభ్యులు సురేష్ బాబు దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వడ్లపాటి రత్నరాజు, వర్ధనపు సామ్యూల్, పిల్లి నాగన్న, సంఘ పెద్దలు విప్పర్తి సామ్యూల్, పైడి ప్రశాంత్ బాబు, గొల్ల రవి, పాలుమూరి శేఖర్, పైడి సువార్త, ఎల్లమెల్లి లలిత కుమారి తదితరులు పాల్గొన్నారు

పిల్లలకు నీతి కథలు, పద్యాలు

నరసాపురం: నరసాపురం గ్రేడ్–1 శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో సోమవారం పిల్లలకు నీతికథలు బోధించారు. అలాగే పిల్లల చేత తెలుగు అధ్యాపకులు పద్యాలు చదివించారు. తెలుగు టు ఇంగ్లీష్ ట్రాన్స్‌లేషన్, యోగా, చెస్ వంటి ఆటలు నేర్పించారు.

పూడుకుపోతున్న ఉప్పుటేరు

ముంపునకు గురవుతున్న గ్రామాలు



భీమవరం మండలం లోసరి వద్ద పూడుకుపోయిన ఉప్పుటేరు దృశ్యం

భీమవరం అర్బన్ : పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల మధ్య ఉన్న ప్రధాన డ్రెయిన్ ఉప్పుటేరు సిల్టు, కిక్కిసతో పూడుకుపోతుంది. దీంతో ఈ డ్రెయిన్ పరివాహక ప్రాంతాలు ఏటా వరదలకు నీటమునుగుతున్నాయి. అంతేకాకుండా ఉప్పుటేరు మొగలో స్లూయిజ్ నిర్మిస్తే కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాలకు తాగు, సాగు నీరు కొరత ఉండదని రైతు విశ్లేషకులు చెబుతున్నారు. ప్రస్తుతం కృష్ణా జిల్లాలో సాగు, తాగు నీరు లేక గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటున్న దృష్ట్యా ప్రజాప్రతినిధులు, అధికారులను స్లూయిజ్ నిర్మించాలని రైతులు కోరుకుంటున్నారు. ఉప్పుటేరు కొల్లేరు నుంచి ఆకివీడు, కాళ్ల, భీమవరం మండలాలు మీదుగా కృష్ణా జిల్లాలోని కృత్తివెన్ను మండలంలోని గొల్లపాలెంలో సముద్రంలో కలుస్తుంది. దీని ఆనుకుని సుమారు 80 వేల ఎకరాలలో వరి సాగు, చేపలు, రొయ్యలు పెంపకం సాగిస్తున్నారు. అధికార యంత్రాంగానికి ఉప్పుటేరుపై దృష్టి లేకపోవడంతో వర్షాకాలంలో ఈ డ్రెయిన్ పొంగి పొర్లుతుంది. ఫలితంగా పరిసర ప్రాంత గ్రామాలు ముంపుకు గురవుతున్నాయి. సముద్రపు ఆటుపోటులకు ఈ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడవలసి వస్తుంది. ఇది జిల్లాలోని ఉప్పుటేరు ప్రాంతాల దుస్థితి. కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాల సరిహద్దుగా ఉన్న ఉప్పుటేరు, కొల్లేరు పెద్దింట్లమ్మ ఆలయం సమీపంలో కొల్లేటికోట జీరో మైలు రాయి వద్ద ప్రారంభమై ఆకివీడు, కాళ్ల, భీమవరం మండలం మీదుగా కృష్ణాజిల్లాలోని గొల్లపాలెం వద్ద సముద్రంలో ఉప్పుటేరు కలుస్తుంది. సముద్రం నుంచి వచ్చే ఆటుపోటలను ఎదుర్కొంటూ ఎగువ ప్రాంతంలో వర్షాలు పడితే ఆ ముంపునీటిని సముద్రానికి ఈ డ్రెయిన్ తరలిస్తుంది. తద్వారా ఈ ప్రాంతంలో వ్యవసాయ భూములు, చేపల చెరువులు ఇతర గ్రామాలకు ముంపు భారి నుంచి ఉప్పుటేరు కాపాడుతూ వస్తుంది. అటువంటి ఉప్పుటేరుపై అధికారులు, పాలకులు సరైన దృష్టి లేకపోవడంతో పూడుకుపోతుంది. తద్వారా ఏటా వేలాది ఎకరాలలో సన్న, చిన్నకారు రైతులు నష్టపోతున్నారు. ఈ డ్రెయిన్‌లో మూడు మీటర్లు పైగా లోతు ఉండవలసిన డ్రెయిన్ కొన్ని ప్రాంతాల్లో మీటర్ లోతుకు పూడుకుపోయింది.

అన్ని డ్రెయిన్‌లు ఉప్పుటేరులోకే :

జిల్లాలోని అన్ని ప్రధాన డ్రెయిన్‌లు జిల్లాకు దక్షిణం వైపు ఉన్న ఉప్పుటేరులోనే కలుస్తున్నాయి. కొల్లేరుతో పాటు ప్రధాన డ్రెయిన్‌లు అయిన మొగదిండి, బొండాడ, పాలిమేరతిప్ప, యనమదుర్రు, సాల్ట్‌క్రీక్ వంటి ప్రధాన డ్రెయిన్‌లు ఉప్పుటేరులో ఆయా ప్రాంతాల్లో కలుస్తున్నాయి. ఈ ప్రధాన డ్రెయిన్‌లకు అనేక మధ్య, చిన్నతరహా డ్రెయిన్‌లు చేరువవుతున్నాయి. ఇవన్నీ చివరకు ఉప్పుటేరులోనే కలుస్తున్నాయి.

వర్షాకాలంలో..

అధిక వర్షాలు, తుఫానులు వస్తే ఉప్పుటేరు తన ఉగ్రరూపాన్ని దాల్చుతుంది. కొల్లేరు తదితర జిల్లాలోని మెట్ట ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా జిల్లాలోని ప్రధాన డ్రెయిన్‌లన్నీ పొంగి పొర్లుతూ ఉప్పుటేరులో కలుస్తున్నాయి. దీంతో ఉప్పుటేరు తన ఉగ్రరూపాన్ని దాల్చుతూ సముద్రం వైపు ప్రవహిస్తుంది. అదే సమయంలో సముద్రంలో ఏర్పడిన ఆటుపోటుల కారణంగా సముద్రపునీరు ఉప్పుటేరులోకి ఎగదన్నడం వల్ల అప్పటికే పొంగి పొర్లుతున్న ఉప్పుటేరు నీరు సముద్రంలోకి వెళ్లలేక ఎక్కడినీరు అక్కడే నిలిచిపోతుంది. దీంతో ఉప్పుటేరు సమీపంలో ఉన్న గ్రామాలన్నీ నీటమునుగుతున్నాయి. ఇంత జరుగుతున్నా ముందుచూపు లేకుండా అధికార యంత్రాంగం వ్యవహరించడం వల్ల అనేక ఇబ్బందులను ఉప్పుటేరు పరివాహక ప్రాంత ప్రజలు ఎదుర్కోవలసి వస్తుంది. చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకున్న చందంగా అధికారులకు ప్రకృతి విపత్తుల సమయంలోనే ఉప్పుటేరు గుర్తొస్తుంది. ఆ సమయంలోనే తాత్కాలిక ఏర్పాట్లు చేసి అధికారులు చేతులెత్తేస్తున్నారు.

పూడికతీత మరచిన యంత్రాంగం :

సుమారు మూడు దశాబ్దాల క్రితం ఉప్పుటేరు పూడికతీత పనులు అధికారులు నిర్వహించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు తట్ట మట్టికూడా ఉప్పుటేరులో త్రవ్వకపోవడం వల్ల డ్రెయిన్ పూర్తిగా పూడుకుపోయే పరిస్థితి ఏర్పడింది. ఇదే పరిస్థితి కొనసాగితే వేలాది ఎకరాలు నీటమునగడంతో పాటు పరివాహనక ప్రాంత గ్రామాలన్నీ ఉప్పుకయ్యలుగా మారే ప్రమాదం ఉందని జలవనరుల నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా సముద్ర ముఖద్వారం నుంచి ఉప్పుటేరు ఎగువ ప్రాంతం వరకు డ్రిజ్జింగ్ చేసి పూడిక పనులు చేపట్టాలని ఈ ప్రాంత ప్రజలతో పాటు నిపుణులు డిమాండ్ చేస్తున్నారు.

స్లూయిజ్ నిర్మిస్తే సస్యశ్యామలం

ఈ డ్రెయిన్‌కు మొగలో స్లూయిజ్ నిర్మిస్తే ఈ డ్రెయిన్ ఆనుకుని పంటపొలాలు, చేప, రొయ్యల చెర్వులు సస్యశ్యామలంగా ఉంటాయని ఈ ప్రాంత రైతులు చెబుతున్నారు. ప్రతి ఏటా జనవరి నుంచి జూన్ నెల వరకు సముద్రం నుంచి ఉప్పునీరు కొల్లేరు వరకు వెళ్లిపోడంతో ఈ ప్రాంతం ఉప్పుకయ్యలుగా మారుతుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే ఈ ప్రాంత రైతులను దృష్టిలో పెట్టుకుని పడతడిక వద్ద స్లూయిజ్ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. మళ్లీ అధికారం చేపట్టగానే శంకుస్థాపన పనులను సీఎం జగన్‌మోహన్ రెడ్డి చేస్తారని ప్రజాప్రతినిధులు చెబుతున్నారు.

ఐటీఐలో బాలికలకు ఉచిత శిక్షణ

ఉండి: జిల్లాలోని ఎన్నార్పీ అగ్రహారం, ఆచంట ప్రభుత్వ ఐటీఐలలో చేరిన బాలికలకు ఆధునిక పద్ధతుల బోధనతో ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు ఐటీఐ జిల్లా కన్వినర్ వీ శ్రీనివాసరాజు సోమవారం పత్రికా ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఐటీఐలలో 2024–25 విద్యా సంవత్సరానికి గాను జూన్ నెల 10వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా దరఖాస్తు స్వీకరించడం జరుగుతుందన్నారు. అర్హులైన విద్యార్థులు ఆయా ట్రేడుల్లో ఐటీఐ.ఏపీ.జీటీవీ.ఇన్ అనే ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను పరిశీలన చేయించుకుని రసీదు పొందాలన్నారు. కౌన్సిలింగ్ సమయంలో రసీదు చూపించాలని అన్నారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ లేకపోతే కౌన్సిలింగ్‌కు అర్హత ఉందని సూచించారు. ఆసక్తి గల బాలికలు కూడా దరఖాస్తు చేసుకోవాలని బాలికలకు పూర్తిస్థాయిలో ఉచితంగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. రెండేళ్ల ఐటీఐ కోర్సులు పూర్తి చేసిన వారికి బ్రిడ్జ్ కోర్సు ద్వారా పాలిటెక్నిక్ రెండవ సంవత్సరంలో నేరుగా ప్రవేశం లభిస్తుందని తెలిపారు. కావున జూన్ 10వ తేదీ సాయంత్రం 5 గంటల లోపుగా దరఖాస్తు చేసుకోవడం, సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ చేయించుకోవడం చేయాలని తెలిపారు.మరిన్ని వివరాల కొరకు 08816297093, 9676099988 నంబర్లలో సంప్రదించాలని శ్రీనివాసవర్మ తెలిపారు.

సెల్‌ఫోన్ వినియోగంపై అవగాహన

అత్తిలి: విద్యార్థులు సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండి, చదువుపై దృష్టి పెట్టాలని రిసోర్సుపర్సన్ కె కోమలి అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా అత్తిలి శాఖా గ్రంథాలయంలో సోమవారం సెల్‌ఫోన్ వినియోగంపై అవగాహన కల్పించారు. సెల్‌ఫోన్‌లు అధికంగా చూడటం వల్ల కళ్లు దెబ్బతింటాయని, కళ్లజోళ్లు వేసుకునే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. గ్రంథాలయాధికారి డి కృష్ణారావు, పి వెంకటేశ్వరరావు, జి గణపతి, తదితరులు పాల్గొన్నారు.

నవయుగ వైతాళికుడు కందుకూరి

భీమవరం : జీవితాంతం సమాజ సేవకే అంకితమైన పరిపూర్ణ వ్యక్తి కందుకూరి వీరేశలింగం పంతులు అని డీఎన్నార్ కళాశాల పాలకవర్గ సహాయ కార్యదర్శి కొత్తపల్లి శివరామరాజు, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అంజన్ కుమార్ అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక, కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో కళాశాల గ్రంథాలయంలో కందుకూరి వీరేశలింగం పంతులు వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ తెలుగు జాతికి నవయుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం పంతులని, తెలుగు గడ్డపై తొలితరం సంఘ సంస్కర్త, మహిళల సంక్షేమం కోసం జీవితాంతం పని చేసారని, స్త్రీ విద్య కోసం ఉద్యమించి బాలికల పాఠశాలను స్థాపించారని, బాల్య వివాహాలను వ్యతిరేకించి, వితంతు పునర్వివాహాలు చేయించారని అన్నారు. రచయిత కలిగొట్ల గోపాల్ శర్మ, కళారంజని నాటక పరిషత్ అధ్యక్షుడు జవ్వాది శ్రీనివాస్ మాట్లాడుతూ సమాజంలోని దురాచారాలను రూపుమాపడానికి కృషి చేశారని, ఆ క్రమంలో సంఘంలోని అవకతవకలను ఎత్తి చూపారని అన్నారు. అనంతరం విద్యార్థులకు పోటీలను నిర్వహించి రచయిత కలిగొట్ల గోపాల్ శర్మ, కళారంజని నాటక పరిషత్ అధ్యక్షుడు జవ్వాది శ్రీనివాస్‌లను సత్కరించారు. కార్యక్రమంలో నరహరిశెట్టి కృష్ణ, లైబ్రేరియన్ కే శిరీష, ఎస్ కే బాబాజీ, ప్రవీణ్ విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



వెంపలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

భీమవరం అర్బన్: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని భీమవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో టి. లక్ష్మీకాంతం అన్నారు. భీమవరం మండలంలోని తాడేరు, దిరుసుమర్రు సెక్టార్ పరిధిలో వెంప, దిరుసుమర్రు గ్రామాల్లో సోమవారం రుతుక్రమ పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా కిషోర బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో టి. లక్ష్మీకాంతం మాట్లాడుతూ కిషోర బాలికలు బలమైన పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. చిన్నవయస్సులో బాల్య వివాహాలు చేయడం వల్ల పిల్లలకు జన్మనిచ్చే సమయంలో తల్లి తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవలసి వస్తుందన్నారు. అంతేకాకుండా రక్తహీనత తదితర ఎన్నో అనర్థాలు వస్తాయన్నారు. బాల్య వివాహాలు చేసిన వారిపై చట్టరీత్యా కఠిన శిక్షలు ఉన్నాయన్నారు. బాలికలు చదువుపై మక్కువ పెంచుకుంటే భవిష్యత్తు బంగారు బాట వేసుకోగలుగుతారన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్ వైజర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


మానవతా సేవలు అభినందనీయం



కలిసిపూడిలో దివ్యాంగుడు నాగన్నకు ట్రై సైకిల్ అందజేస్తున్న మానవతా ప్రతినిధులు

ఉండి: మానవతా సేవలు అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. మానవతా స్వచ్ఛంధ సేవాసంస్థ ఆధ్వర్యంలో మండలంలోని కలసిపూడి గ్రామానికి చెందిన దివ్యాంగుడు మందపాటి నాగన్నకు సోమవారం ట్రై సైకిల్‌ను అందజేశారు.ఈ సందర్భంగా మానవతా మండల కన్వినర్, కో కన్వినర్ కొమ్మన నాగబాబు, దంగేటిరామలింగేశ్వరరావు మాట్లాడుతూ మానవతా సేవాసంస్థ ద్వారా మండలంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. అలాగే చివరి మజిలీలో అంతిమ సంస్కారాల కోసం ఫ్రీజర్ బాక్సులు అందజేయడం వంటి కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మానవతా ప్రతినిధులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా మట్టి అక్రమ రవాణా



పాలకొల్లు మండలం దిగమర్రులో ట్రాక్టర్‌లో మట్టి అక్రమ రవాణా చేస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు మండలం దిగమర్రు నుంచి మట్టి అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. దీనికి అధికారుల అండదండలు పూర్తిగా ఉన్నాయని సమాచారం. దిగమర్రు నుంచి నిత్యం అంబేద్కర్ కోనసీమ జిల్లాకు సుమారు 20కి పైగా ట్రాక్టర్లు మట్టి రవాణా చేస్తున్నాయి. వీటికి ఏ విధమైన అనుమతులు లేవంటున్నారు. స్థానిక ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు సహకారంతో ఈ అక్రమ దందా సాగుతున్నట్లు తెలుస్తోంది. ట్రాక్టర్లలో లోడు చేసిన మట్టిపై ఎటువంటి బరకాలు కప్పకపోవడంతో మట్టి బెడ్డలు జాతీయ రహదారిపై పడుతున్నాయి. వర్షం కురిసిన సమయంలో మట్టి బెడ్డలు జిగురుగా మారడం వలన ద్విచక్ర వాహనాలు జారిపోతున్నాయి. దీంతో వాహనదారులు గాయాలపాలవుతున్నారు. పోలీస్, రవాణా, మైనింగ్, రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై ఈ మట్టి దందా చేస్తున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. దీనిపై దిగమర్రు సర్పంచ్ రాపాక కరుణాకర్ మాట్లాడుతూ పంచాయతీ రోడ్లు పాడైపోతున్నాయని పంచాయతీరాజ్, మైనింగ్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని సోమవారం విలేకరులకు తెలిపారు. దీనిపై తహసీల్దార్ మధుసూదనరావును వివరణ కోరగా మట్టి రవాణాకు ఎవరికీ అనుమతులు ఇవ్వలేదని చెప్పారు.

కౌంటింగ్‌లో నిబంధనలు పాటించాలి



వి స్వామి నాయుడు, రిటర్నింగ్ అధికారి

పెనుగొండ: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌లో నిబంధనలు పాటిస్తూ, ఎటువంటి వివాదాలకు తావివ్వకుండా సిబ్బంది కౌంటింగ్ పూర్తి చేయాలని ఆచంట నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి స్వామి నాయుడు తెలిపారు. సోమవారం ఆచంటలోని రామేశ్వరస్వామి సత్రంలో నియోజకవర్గం పరిధిలోని కౌంటింగ్ సిబ్బంది, సూపర్‌వైజర్లు, అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లకు నిర్వహించిన శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడారు. ఏ ఒక్కరికీ మొబైల్ ఫోన్లకు అనుమతి లేదన్నారు. విరామం లేకుండా కౌంటింగ్ నిరంతరం సాగాలన్నారు. కౌంటింగ్ సిబ్బంది ఉదయం 6 గంటల కల్లా కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాలకు సంబంధించి 14 టేబుల్స్, పోస్టల్ బ్యాలెట్‌కు 4 టేబుల్స్ కేటాయించినట్లు వివరించారు. పోలింగ్ స్టేషన్ల వారీగా ఈవీఎంలను లెక్కింపు పంపడం జరుగుతుందన్నారు, సర్వీస్ ఓటర్ల నుంచి వచ్చే పోస్టల్ బ్యాలెట్‌లను స్కానింగ్ చేసే విధానాన్ని వారికి పవర్ పాయింట్ ద్వారా వివరిస్తూ, సీసీ టీవీ కెమెరాల పర్యవేక్షణలో కౌంటింగ్ జరుగుతుందన్నారు. మొబైల్ ఫోన్ల కోసం డిపాజిట్టు కౌంటర్లను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కంట్రోల్ యూనిట్‌లో ఫలితాలను ఏవిధంగా చూపించాలనేది, ప్రత్యక్షంగా కంట్రోల్ యూనిట్‌పై చూపించి వివరించారు. కౌంటింగ్ సూపర్‌వైజర్లు ఫాం 17సిలో నమోదు చేసిన ఓట్లను, ఈవీఎంలలో ఉన్న ఓట్ల సంఖ్యతో సరిచూసుకోవాలన్నారు. ఫలితం సంఖ్యను ఫాం 17సీ పార్ట్2లో నోట్ చేయాలన్నారు, దానిని కౌంటింగ్ ఏజెంట్లుకు చూపి సంతకం తీసుకోవాలన్నారు. పోలైన ఓట్లకి, కంట్రోల్‌యూనిట్‌లో ఓట్లకు తేడా ఉంటే, కంట్రోలు యూనిట్లు పక్కన పెట్టి, మొత్తం ఈవీఎంల కౌంటింగ్ పూర్తయ్యాక, కంట్రోల్ యూనిట్ కంటే మెజార్టీ తక్కువగా ఉంటే వీవీ ప్యాట్‌ల స్లిప్పులు లెక్కించాలన్నారు. ఈవీఎం కౌంటింగ్ పూర్తయ్యాక ఎంపిక చేసిన 5 వీవీ ప్యాట్‌ల స్లిప్పులను లెక్కించాలన్నారు. ఏ అభ్యర్థికి ఎన్ని ఓట్లు వచ్చాయన్న వివరాలను బోర్డుపై ప్రకటించాలన్నారు. శిక్షణ కార్యక్రమంలో తహసీల్దార్లు ఐపీ శెట్టి, ఆర్‌వీపీ రోహిణీ, కే లక్ష్మీ కల్యాణి, ఎంపీడీవోలు ఎస్ శ్రీనివాస్ దొర, పి పద్మజ, డి సుహాసిని, ఎలక్షన్ డీటీ ఎం రాంప్రసాద్ పాల్గొన్నారు.

‘టీడీపీ నేతలకు మతి భ్రమించింది’



జిన్నూరులో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పోడూరు: ఇటీవల జరిగిన ఎన్నికల్లో పోలింగ్ సరళిని చూసి టీడీపీ నేతలకు ఓటమి భయం పట్టుకుందని, దీంతో మతిభ్రమించి నొటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని జిన్నూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు తొండా శ్రీనివాస్, గ్రామ కమిటీ అధ్యక్షుడు భూపతి రాజు సూర్పరాజు తదితరులు ఎద్దేవా చేశారు. సోమవారం వారు విలేకర్లతో మాట్లాడారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యడ్ల తాతాజీని విమర్శించే స్థాయి వార్డు మెంబర్‌గా రెండుసార్లు పోటీ చేసి ఓడిపోయిన టీడీపీ నాయకుడికి లేదన్నారు. అంతేకాకుండా పాలకొల్లు పేరు చెబితే క్షీరారామలింగేశ్వర స్వామి గుర్తుకువస్తారని, అటువంటిది పాలకొల్లు పేరు చెబితే తనపేరు గుర్తుకు వస్తుందని నిమ్మల రామానాయుడు టీడీపీ నేతలు, కార్యకర్తల ద్వారా పబ్లిసిటీ చేయించుకోవడం చూస్తుంటే వారి పబ్లిసిటీ పిచ్చి పరాకాష్టకు చేరిందని అర్థమవుతుందన్నారు. రామానాయుడు గొప్పలు చెప్పించుకోవడం చూస్తుంటే సొంత టీడీపీ కేడర్ నవ్వుకుంటుందని వైఎస్సార్ సీపీ నేతలు ఎద్దేవా చేశారు. జిన్నూరు సొసైటీ చైర్మన్ జక్కం శెట్టి అప్పాజీ, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ కార్యదర్శి మీసాల దాన వెంకట నరసింహులు, కడలి సూర్యచంద్రరావు, రెడ్డి అంజిబాబు, చెల్లబోయిన దుష్యంతుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

భీమవరం: జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ఎస్ఎస్‌సీ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వి.రమణ తెలిపారు. సోమవారం జరిగిన ఇంగ్లీష్ పరీక్షకు 1548 మంది విద్యార్థులకు గాను 366 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. 30 పరీక్షా కేంద్రాల్లో తనిఖీలు చేయగా ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు కాలేదని తెలిపారు. అదే విధంగా ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల్లో కూడా ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని ఎగ్జామినేషన్ అధికారి కె.చంద్రశేఖర్‌బాబు తెలిపారు. జనరల్ కేటగిరీలో 1812 మందికిగాను 1664 మంది, ఒకేషనల్ కేటగిరీలో 187 మందికిగాను 161 విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు.

అనుమతులు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

పెనుగొండ: ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా విద్యార్థులను చేర్చుకుంటున్న ప్రైవేట్ విద్యాసంస్థలపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్య సభ్యులు కోరారు. సోమవారం సిద్ధాంతంలో వారు విలేకర్లతో మాట్లాడుతూ సిద్ధాంతంలో ఓ ప్రైవేటు పాఠశాల వారు విద్యార్థులకు ఉచిత సదుపాయాలంటూ మభ్యపెడుతున్నారని ఆరోపించారు. ఇప్పటివరకూ వారికి ఎటువంటి అనుమతులు లేకపోయినా అడ్మిషన్లు ప్రారంభించి విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకొంటున్నారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్య సభ్యులు జి.కేశవ, జక్కం విజయ కుమార్, టి. చంద్రశేఖర్, ఎం.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. దీనిపై పెనుగొండ ఎంఈఓ డి సుభాకర్‌ని వివరణ కోరగా ప్రస్తుతానికి ఆ ప్రైవేట్ పాఠశాలకు జిల్లా అధికారుల నుంచి ఎటువంటి అనుమతులు రాలేదని స్పష్టం చేశారు.

దోమకాటు నుంచి ప్రజారోగ్యాన్ని పరిరక్షిద్దాం



ఆరోగ్య సిబ్బందిచే హెల్త్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రజారోగ్య పరిరక్షణ కోసం వైద్య ఉద్యోగులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రజల్ని వ్యాధుల బారి నుంచి రక్షించాలని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు పేర్కొన్నారు. కాలానుగుణ వ్యాధులపై పట్టణ ఆరోగ్య కేంద్రం బేబి సెంటర్ పరిధిలో 9,11 వార్డులలో ఫ్రైడే, డ్రై డేలు కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సోమవారం పరిశీలనలు జరిగాయి. హెల్త్ అధికారులు, సిబ్బంది ప్రజలతో మమేకమై పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వారంలో ఒక రోజు డ్రై డే, ఫ్రైడే పాటించడం ద్వారా డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల నుంచి దూరంగా ఉండవచ్చునని చెప్పారు. హెక్టార్ కంట్రోల్ హైజీన్‌లను పర్యవేక్షించారు. వార్డులలో ఆరోగ్య అవగాహన ర్యాలీలు జరిగాయి. దోమల లార్వాలను కనుగొనటలో సిబ్బంది సాంకేతికంగా ముందు వరసలో ఉండాలని చెప్పారు. ఇళ్లలో ఉన్న నీటిని నిల్వ చేసే కంటైనర్లు, ఓవర్‌హెడ్ ట్యాంక్స్, ఫ్రిజ్‌లు, కూలర్స్‌ను విధిగా పరిశీలించుకోవాలని, లార్వాలు పుట్టకుండా చూడాలన్నారు. అనుమానిత జ్వరం కేసులను ప్రాథమిక పరీక్షల కోసం సమీపంలోని ఆరోగ్య కేంద్రాలకు పంపాలని చెప్పారు. వార్డు ఆరోగ్య కార్యదర్శులు పోసమ్మ, టి.ఎన్.లక్ష్మి, ఆరోగ్య సహాయకులు కాంతారావు, ఆశా కార్యకర్తలు సుజాత, సుమలత, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావడం ఖాయం



కేపీపాలెంలో విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మొగల్తూరు: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ మరోసారి అధికారంలోకి రావడం ఖాయమని, రాష్ట్ర ప్రజలకు మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహనరెడ్డి సంక్షేమ పాలన అందించనున్నారని ఆ పార్టీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు కోడెల్లి వెంకట్రావు ధీమా వ్యక్తం చేశారు. సోమవారం కేపీపాలెం గ్రామంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ ప్రభంజనం కనిపిస్తుందని సర్వేలు చెబుతున్నాయని, గత ఐదేళ్లలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాలతో లబ్ధిపొందిన ప్రజలే ఆయనకు మద్దతుగా నిలిచారన్నారు. నరసాపురం నియోజకవర్గ అభివృద్ధికి తన వంతుగా కృషి చేసిన ముదునూరి ప్రసాదరాజు కూడా అఖండ విజయం సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కూటమి పార్టీలు ఎన్ని కుట్రలు పన్నినా అంతిమ విజయం మాత్రం వైఎస్సార్ సీపీదేనని అన్నారు. ముదునూరి ప్రసాదరాజు విజయం సాధిస్తేనే తీరప్రాంత గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు కారుమంచి అంబేడ్కర్ తదితరులు పాల్గొన్నారు.